# సంపాదకీయము

మన ఆధ్యాత్మిక పయనము సత్యపథములో మరోయేడు జరిగింది. అ పయనములో ఎవరికి వారు తమ ప్రగతి బేరీజువేసుకొని చూసుకొంటూ మరింత త్వరితగతిని గమ్యం చేరుకోవాలనే ఆకాంక్ష పెంచుకొంటూయుండడాన్ని గమనిస్తే మన గురువుగారి అశయం నెరవేరే రోజులు చేరువలోనే యున్నదనే భావన కలుగుతుంది. పర్వదినం దీపావళి - బారులు తీర్చిపేర్చిన దీపకళికలు మనకెంతో మానసికానందం అందివ్వడం ఏటా అనుభవిస్తూనే యున్నాము. కాని మనము అనుభవించే దీపావళి వున్నతమైనది. సత్సంఘములో పాల్గొనే వారందరి హృదయాలను గమనించే భాగ్యం మనకుంది. వారి హృదయపు ప్రమిదలలోని దీపాలు దివ్యజ్యోతులై మానసికానందమే కాక శాంతి సమృద్ధికూడా మనకివ్వడం పూజ్య బాబూజీగారు మనకిచ్చిన వరం. నిరంతరం యిట్టి దీపావళిని కాపాడుకొంటూ పెంచుకొంటూ పోవడము మన కర్తవ్యంగా భావించినవారము కాబట్టి ఏదో వారమునకొకరోజు మనందరము కలిసికొంటే సరిపోతుందని భావించక, ప్రతిదినము సాయంకాలము పలుచోట్ల దివ్యకూడలిని ఏర్పరచుకొన్నాము. ఆహ్లాదానికి అంతేముంటుంది కనుక.

మన గురువు పూజ్య బాబూజీ గారి జన్మదినమగు ఆదివారాన్ని వారి జ్ఞాపకంలోనే గడపాలనే సదుద్దేశంతో "Imperience" లో సత్సంఘము తర్వాత ఏదోఒక ఆధ్యాత్మిక అంశముపై పూర్ణమైన అవగాహన ఏర్పడడానికై చర్చాగోష్ఠి ఏర్పరచుకొన్నాము. ఇందులో పెక్కురు పాల్గొనడము - వారి హృదయంలో దర్శించిన దీపావళిని గమనించడము జరిగినప్పుడు కలిగిన ఆనందం దివ్యం. అనుభవించడానికి ఆస్కారమున్నా అందరికీ ఆ అదృష్టముండకపోవడం గమనించినపుడు మనస్సులో ఏదో 'బాంబు' ప్రక్కన ప్రేలినట్లుండి కొంత సంతోషం కోల్పోయినట్లుంటుంది. ఎవ్వరోయడ్డుపడి యిది జరిగియుంటే అంత బాధయుండక పోవును. అయితే యిది స్వయంకృతమయినప్పుడు మరియు అట్టి అభాగ్యుల ఎడ మన బాధ్యత మరింత పెడుగుతుందనే విషయం గుర్తుకు వచ్చినపుడు వారికున్న అవకాశముగురించి మరోమారు విన్నవించుకోవాలన్న తపనే యీప్రయత్నము. దివ్యజ్యోతులను కనండనే పిలుపు యివ్వడానికి గలిగిన అవకాశమిచ్చిన వారందరికి దీపావళి శుభాకాంక్షలు.

(2003 దీపావళి సంచిక :10-4)